

కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి పూజలు

చంపాపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో నిత్య పూజలందుకుంటున్న ధ్యానాంజనేయ స్వామిని గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కుటుంబ సభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు నారాయణరెడ్డికి ఆశీర్వచనాలు అందించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



గౌస్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

రేవంత్ రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షుడిగా గౌస్

మలక్‌పేట జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట డివిజన్ రేవంత్ రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షుడిగా మహ్మద్‌గౌస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎన్నుకున్నారు ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నానని సీఎం రేవంత్ రెడ్డి అభిమాన సంఘం పేరుతో ప్రజలకు సమాజ సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఓల్డ్ మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, బాబు శ్రీనివాస్, రవికుమార్, ఆకుల రాజు, రామక్రిష్ణ, టి.రాజు పాల్గొన్నారు.

ఆ మట్టితో మాకు సంబంధం లేదు

వార్డు కౌన్సిలర్ అనురాధసురేష్



కౌన్సిలర్ అనురాధసురేష్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దఅంబర్‌పేట్‌లో శిలాఫలకంపై మాజీ కౌన్సిలర్ పేరు కనిపించకుండా పోసిన మట్టికి, తనకు ఎలాంటి సంబంధం లేదని 5వ వార్డు కౌన్సిలర్ బొర్ర అనురాధసురేష్ స్పష్టం చేశారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ కౌన్సిలర్ తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాజీ కౌన్సిలర్ చేసిన అసత్య ఆరోపణలను కౌన్సిలర్ అనురాధసురేష్ తీవ్రంగా ఖండించారు. వారు ఆరోపణలు చేసిన శిలాఫలకం 6వ వార్డు పరిధిలోకి వస్తుందని తెలిపారు. మాజీ కౌన్సిలర్‌కు వార్డు పరిధి ఎక్కడవరకు వస్తుందో కూడా తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఒకరిపై ఆరోపణలు చేసేముందు ఒక్కసారి ఆలోచించుకోవాలని సలహాఇచ్చారు. మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. చిల్లర రాజకీయం చేస్తుందెవరో వార్డు ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చంపాపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ ఆర్ఎల్‌సీ-1 జానిమియా, ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల, చాంద్రాయణగుట్ట బాలుర-1 కళాశాలల్లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న మైనార్టీ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు కళాశాలలో ఫిబ్రవరి 6 వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఐఈఎస్.తెలంగాణ. సీజీజీ జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా లేదా తెలంగాణ మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ ద్వారా పొందవచ్చని వారు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 21 బాలుర, 19 బాలికల పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు. వాటిలోని నాలుగు కళాశాలల్లో వృత్తి విద్య కోర్సులు, హాస్పిటాలిటీ, మేనేజ్‌మెంట్, ఎమ్ఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. వాటికి కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముషీరాబాగ్ మైనార్టీ గురుకుల పాఠశాలలో..

సైదాబాద్ : ముషీరాబాగ్ మైనార్టీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.నర్సింహ్మ తెలిపారు. 5వ తరగతిలో విద్యనభ్యసించేందుకు మైనార్టీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓసీలకు డ్రా పద్ధతిన ఎంపిక చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 6,7,8 తరగతుల్లోను బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి, జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. మిగతా వివరాలకు ఫోన్ నెంబర్లు 7995057875, 9908146808లలో సంప్రదించాలని కోరారు.

మైనారిటీ గురుకుల కళాశాలలో ..

మన్సూరాబాద్ : ఎల్‌బీనగర్, సూర్యోదయనగర్ కాలనీలోని మైనారిటీ గురుకుల కళాశాల (బాలానగర్ గర్ల్స్)లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సవం ప్రవేశాలకు విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.వినీల తెలిపారు. ఇంటర్ సీఈసీ, హెచ్‌ఈసీలలో మైనారిటీ, నాన్‌మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 91543 65042, 91602 55040 నంబర్లలో సంప్రదించాలన్నారు.



హెచ్‌ఎంలకు డైరీలను అందజేస్తున్న ఉపాధ్యాయ నేతలు

పీఆర్‌టీయూ డైరీల పంపిణీ

సైదాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గురువారం పీఆర్‌టీయూ డైరీలను ఉపాధ్యాయ సంఘం నేతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ డైరీలో ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రూల్స్ ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు త్వరలో పరిష్కారం కానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.వి.సాంబశివరావు. ఆంజనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

రాజకీయ పునర్జన్మ ఇచ్చింది తెలుగుదేశం పార్టీయే

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత సీఎం నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం ఎన్టీఆర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో రాజకీయ పునర్జన్మ ఇచ్చింది తెలుగుదేశం పార్టీయే అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్, ఈశ్వరమ్మ యాదవ్, ప్రవీణ్ చౌదరి, మువ్వ సతీష్ చౌదరి, అనిల్ చౌదరి, చింతల రవికుమార్, వెలగ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అనురాధరాంరెడ్డి, టీడీపీ నాయకుడు సంరెడ్డి భుజంగరెడ్డి తదితరులు



స్వర్గీయ ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బైగళ్ల రవి, ఆరె కృష్ణ, వేణుబాబు, జమీల్, కృష్ణయాదవ్ తదితరులు

ఎన్టీఆర్‌కు నివాళులు

టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ టీడీపీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేసి, పేదలకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

-ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, ఆంధ్రజ్యోతి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న టీడీపీ నాయకులు వెంకట్‌గాంధీ, చంద్రశేఖర్‌లు

ఆలయాలలో స్వచ్ఛతా కా అభియాన్



హస్తినాపురం సెంట్రల్‌కాలనీలోని రామాలయంను శుభ్రం చేస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు



స్వచ్ఛతా కా అభియాన్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, సుభాష్‌చందర్జీ

చంపాపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవంను పురస్కరించుకొని కేంద్ర కమిటీ పిలుపు మేరకు హస్తినాపురం డివిజన్ సెంట్రల్ కాలనీలోని రామాలయంలో గురువారం బీజేపీ నేతలు స్వచ్ఛత కా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో దేవుడిని పూజించడం మొదటి కార్యక్రమం అని, పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం రెండవ కార్యక్రమం అన్నారు. భవ్య రామమందిరం ప్రారంభోత్సవంను ప్రధాని మోదీ ఘనంగా జరుపుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేష్‌యాదవ్, నాయకులు రాజేంద్రప్రసాద్, అమరేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, మాధవరెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛతాకా అభియాన్‌లో భాగంగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం కరణ్‌బాగ్ మల్లన్నస్వామి ఆలయంలో బీజేపీ నేతలు శుభ్రత పనులు చేపట్టారు.

ఈ సందర్భంగా నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ మాట్లాడుతూ ప్రధాని మోదీ కృషి వల్లే రామ మందిరం నిర్మాణం సాధ్యమైందని పునరుద్ఘాటించారు. రామ మందిర ప్రారంభాన్ని బహిష్కరించిన కాంగ్రెస్‌ను దేశప్రజలు ఎప్పుడో బహిష్కరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రవీందర్‌రెడ్డి, నవీన్‌పటేల్, గజానంద్, లక్ష్మారెడ్డి, శ్రీను, యశ్వంత్, రాజారాం పాల్గొన్నారు.

ప్రేమను నిరాకరించిందన్న కోపంతో .. బాలికపై బాలుడి దాడి

అడ్డుకోబోయిన బాలిక సోదరికి గాయాలు

అంబర్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో ఓ బాలికపై బాలుడు దాడి చేశాడు. బాగ్‌అంబర్‌పేటకు చెందిన బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. కొంతకాలంగా బాలుడు ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో బాలిక ఇంటికి వెళ్లిన బాలుడు ఆమెతో మాట్లాడడానికి ప్రయత్నించగా నిరాకరించింది. దీంతో ఆగ్రహం చెందిన బాలుడు ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో బాలికపై దాడికి పాల్పడగా కాలికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న బాలిక సోదరి అడ్డుకోబోగా బాలుడు ఆమె పొట్టలో పొడిచాడు. గాయపడ్డ ఇద్దరు బాలికలను స్థానికులు ఆంధ్ర మహిళాసభ ఆస్పత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. సంఘటనా స్థలాన్ని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ సందర్శించారు. బాలుడిపై హత్యాయత్నం, పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ ఇంట్లో ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు

- పోలీసుల దాడుల్లో స్వాధీనం
- కువైట్ పారిపోయిన డాక్టర్

రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు గురువారం సంయుక్తంగా ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించి అధిక మత్తునిచ్చే 57 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ ఓ ఆస్పత్రిలో అనస్తీషియన్. సర్జరీల సందర్భంగా మత్తు కోసం ఇచ్చే ఫెంటానిల్ మత్తు ఇంజక్షన్‌లను బయట మార్కెట్‌లో రూ.17,500కు విక్రయిస్తున్నాడు. ఇవి హెరాయిన్ కంటే 50 శాతం ఎక్కువ, మార్ఫిన్ కంటే మరింత ఎక్కువ ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. యాప్ ద్వారా బయట వ్యక్తులకు డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ప్రతీ రోజు ఓ డెలివరీ యాప్ పార్సిల్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గురువారం అతడి ఇంటిపై దాడి చేయగా డాక్టర్ కువైట్ పారిపోయినట్లు గుర్తించారు.

అతడి భార్య లుబ్నా నజీబ్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 57 మత్తు ఇంజక్షన్లు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ వస్తే అతడు ఎవరెవరికి మత్తు ఇంజక్షన్‌లు విక్రయిస్తున్నాడనే వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

రేపు హెచ్‌సీయూలో కులగణన.. సామాజిక న్యాయంపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రేపటి నుంచి రెండు రోజులపాటు (శుక్రవారం, శనివారం) కులగణన-సామాజిక న్యాయం అంశంపై ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. సదస్సులో విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ ప్రముఖులు సామాజిక కార్యకర్తలను ఒక తాటిపైకి తీసుకువచ్చి కులగణనపై ఉన్న అనేక అంశాలు, సందేశాలను చర్చించడం జరుగుతుందని కార్యనిర్వాహకులు, ఏఐఓబీఎస్ఏ జాతీయ అధ్యక్షులు జీ.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరగబోతున్న సెమినార్‌లో ప్రముఖ విధాన రూపకర్త శ్యాం పిట్రోడా, ద్రవిడ కళగం కార్యదర్శి కే.వీరమణి, డీఎంకె రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ ఇ.వెంకటేశు, ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొంటున్నారని నిర్వాహకులు, ఏఐఓబీఎస్ఏ జాతీయ కార్యదర్శి ఎస్.సాయికిరణ్, కొండల్ ఓర్సు తెలిపారు.

అవయవ దానం

రాంగోపాల్‌పేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణించి పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో ఆదర్శప్రాయమైంది. హైదరాబాద్ టోకిగూడకు చెందిన అన్నారపు శంకర్(61) అనారోగ్యంతో స్పృహతప్పి పడిపోవడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టిందని వైద్య పరీక్షల్లో గుర్తించిన వైద్యులు రెండు రోజులు శ్రమించి వైద్యం చేసినప్పటికీ గురువారం శంకర్ బ్రెయిన్ డెడ్ అయ్యి మృతిచెందాడు. అనంతరం అవయవ దానం గురించి మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు ఆస్పత్రిలోని అవయవదాన సమన్వయకర్తలు అవగాహన కల్పించారు. దీంతో శంకర్ భార్య లలిత, నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలను దానం చేశారు. అనంతరం జీవన్‌దాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానల్ ద్వారా అవసరం ఉన్న చోటికి ఆ అవయవాలను తరలించారు.

లేని తహసీల్దార్ పేరుతో కులధ్రువపత్రం

- డబుల్ బెడ్‌రూం కోసం ఫోర్జరీ చేసిన మహిళ
- తప్పును సరిదిద్దేందుకు జత చేసి మరోసారి దరఖాస్తు
- పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే డబుల్ బెడ్ రూం కోసం ఓ మహిళ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందినట్లు బహదూర్‌పురా మండల కార్యాలయం అధికారులు గుర్తించారు. అసలు లేని తహసీల్దార్ పేరుతో ధ్రువీకరణ పత్రం జారీ కావడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. దివాన్‌దేవిడి ప్రాంతానికి చెందిన శేఖర్ భార్య మంజుల(36)కు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ మంజూరైంది. 2023 అక్టోబర్ 13వ తేదీన బహదూర్‌పురా మండల అధికారులు ఎస్సీ మాదిగ కులానికి చెందినట్లుగా జారీ చేసినట్లు కుల ధ్రువీకరణ పత్రం పొందింది. ఇల్లు అప్పగించేందుకు బల్దియా అధికారులు పత్రంలోని తప్పులను సరిదిద్ది కొత్తగా కావాలని సూచించారు. సదరు మహిళ అప్పటికే పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకుంది. గురువారం దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యారు. జారీ చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ పేరు జానకిగా ఉంది. అసలు జానకి పేరుతో ఏ తహసీల్దార్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాన్ని ఎలా పొందావని మహిళను అధికారులు ప్రశ్నించారు. తన భర్త తెచ్చాడని, నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ మీ-సేవ సెంటర్ నిర్వాహకులు ఇప్పించారని చెప్పింది. విస్మయానికి గురైన తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఇంకా ఎన్ని ఫోర్జరీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. మీ-సేవ సెంటర్ నిర్వాహకుడి పాత్ర ఏంటి అనే వివరాలు పోలీసు దర్యాప్తులో తేలుతాయని బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

నేడు గిరిజన సంస్కృతి పరిరక్షణపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నాంపల్లి, తెలుగు వర్సిటీలోని సమావేశ మందిరంలో 'జానపద, గిరిజన కళలు, సంస్కృతి-అధ్యయనం-పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. సదస్సులో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



శంకర్ గౌడ్‌ను సత్కరిస్తున్న ఆర్మీ అధికారులు

శంకర్‌గౌడ్‌కు ఆర్మీ అధికారుల ప్రశంసలు

సైనికుడిని కాపాడేందుకు ప్రయత్నించినందుకు అభినందన

ఎల్‌బీనగర్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల లంగర్‌హౌస్ వంతెనపై చైనా మాంజాతో తీవ్ర గాయాలై రక్తస్రావంతో రహదారిపై పడి ఉన్న సైనికుడు కోటేశ్వర్ రెడ్డిని కాపాడేందుకు ప్రయత్నించిన గడ్డం శంకర్‌గౌడ్‌ను సైనికాధికారులు సరూర్‌నగర్‌లోని కామేశ్వర్‌నగర్‌లో అభినందించి, జ్ఞాపిక అందజేశారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం విట్టాపూర్‌కు చెందిన శంకర్‌గౌడ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సరూర్‌నగర్‌లో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఇటీవల సైనికుడు కోటేశ్వర్ రెడ్డి విధులకు వెళ్తుండగా చైనా మాంజా మెడకు చుట్టుకుని తీవ్ర రక్తస్రావంతో కనిపించాడు. అదేమార్గంలో వెళ్తున్న శంకర్‌గౌడ్ గమనించాడు. ఓ మహిళ చున్నీ ఇవ్వగా రక్తస్రావాన్ని ఆపేందుకు కట్టుకట్టాడు. అనంతరం వాహనంలో సైనిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అక్కడి వైద్యులు ఎంతగా ప్రయత్నించినా కోటేశ్వర్ రెడ్డి ప్రాణాలు దక్కలేదు. సైనికుడి ప్రాణాలు కాపాడేందుకు చేసిన సేవలను గుర్తించిన శంకర్‌గౌడ్‌ను సైనికాధికారులు కల్నల్ బాలకృష్ణన్, ఎంకే.నాయక్, జయరాంలు అభినందించారు.



ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ చేస్తున్న ఎంఆర్‌పీఎస్ టీఎస్ నాయకులు

రానున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి : ఎంఆర్‌పీఎస్

మన్సూరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ టీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏబీసీడీ వర్గీకరణ డిమాండ్ చేస్తూ గురువారం ఎల్‌బీనగర్‌లోని అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ టీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జీ.డీ. నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపయ్య నాయకత్వంలో ముప్పై ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంతో మాట్లాడాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే దళిత బంధు అమలు చేయాలని, ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులకు దళితబంధు నిధులు విడుదల చేయాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు ఆకారపు రుక్కమ్మ, చిన్నగల యాదయ్య, వేముల సూర్యప్రకాశ్, పసుపుల హరిబాబు, చింతకుంట్ల రామస్వామి, ధ్యావని నర్సింమ, నల్ల నర్సింహారావు, కూరపాటి జగదీశ్ పాల్గొన్నారు.